క్లుప్తంగా

మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పిల్లి శ్రీలత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం డీసీఎంఎస్ చైర్మన్ ఫక్రుద్దీన్‌తో కలిసి ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదావకాశాన్ని మక్క రైతులు సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధరతో విక్రయించాలని కోరారు. సర్పంచ్ గొట్టె జ్యోతి, ఎంపీటీసీ పండగ గంగవ్వ, ఏఎంసీ డైరెక్టర్ గంగాధర లస్మయ్య, రైతులు పాల్గొన్నారు.

మంత్రి 'గంగుల'ను కలిసిన మేదరి సంఘం నాయకులు



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇటీవల నూతనంగా ఎన్నిక కాబడిన మేదరి(మహేంద్ర) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోరిగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్‌లు శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏకుల రాజనర్సు, జిల్లా అధ్యక్షుడు మదిరే రవీందర్, నగర అధ్యక్షుడు ఏకుల రమేశ్, నాయకులు అలిపిరెడ్డి లచ్చయ్య, మధురై గంగాధర్, మదిరె శ్రావణ్, శనిగరపు సతీశ్, సర్వేశం సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి'

విద్యానగర్(కరీంనగర్): ఇంటర్ చదివే బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుకు రూ.30వేలు, సీఈసీకి రూ.20వేల ఫీజు నిర్ణయించి ఈ ఫీజులను ప్రభుత్వమే భరించాలన్నారు. డిగ్రీ నుంచి మొదలుకొని ఇతర వృత్తి విద్యా కోర్సులకు ప్రతి రెండు నెలలకు ఓసారి పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచుతున్న ఫీజులను ప్రభుత్వమే నిర్ణయించి చెల్లించాలని కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రసమయి

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ భగత్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పడాల శంకరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా శనివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్‌లు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని సీతారాంపూర్ సేవా కేంద్రంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను బ్రహ్మకుమారీస్ ముఖ్య సంచాలకులు విజయ శనివారం ప్రారంభించారు. పిల్లల్లో సృజనాత్మకంగా నైతిక విలువలను పెంచేందుకు, మెడిటేషన్‌పై అవగాహన కల్పించేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడుతాయని అన్నారు. పిల్లలందరూ క్యాంపు ద్వారా చక్కటి విలువలను అలవర్చుకొని మెడిటేషన్‌ను అర్థం చేసుకొని నిత్యజీవితంలో దానిని అభ్యసించే అలవాటు చేసుకోవాలన్నారు. శిబిరంలో పిల్లలకు విలువలతో కూడిన ఆక్టివిటీస్, ఆటలు, డ్రాయింగ్ కథల పోటీలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, వరంగల్ నుంచి వచ్చిన బ్రహ్మకుమారీస్ టీచర్స్ మనీషా, చరిత, పద్మ, మీనాక్షి, శ్వేత, ఆర్తి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచేలా..

- బాలభవన్‌లో శిక్షణ తరగతులు
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు



మృదంగంలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయ కళలు, ఆటలు తదితర అంశాలను నేర్చుకునేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. వేసవి సెలవుల్లో 45 రోజుల పాటు కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో గల బాలభవన్‌లో ఉచిత శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణ శిబిరంలో సంగీతం, నృత్యం, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, మృదంగం, టైలరింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మెహందీ, అబాకస్, శాస్త్రీయ నృత్యం, చెస్, యోగా వంటి వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు. జూన్ 5 వరకు జరిగే ఈ శిబిరంలో 500 మందిపైగా చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్లు బాలభవన్ నిర్వాహకురాలు కట్టా మంజులాదేవి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళల్లో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

మృదంగంలో తర్ఫీదు



నాకు మృదంగం అంటే ఇష్టం. రెండు సంవత్సరాల నుంచి మృదంగంలో శిక్షణ తీసుకుంటున్న. సమ్మర్ హాలీడేస్‌లో బాలభవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో తర్ఫీదు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– విశ్వశ్రీ, తిరుమలనగర్

ఆర్ట్‌క్రాఫ్ట్‌లో..



ఆర్ట్ క్రాఫ్ట్, మెహిందీలో శిక్షణ తీసుకుంటున్న. కొత్త కొత్త రకాల డిజైన్లలో ఆర్ట్‌క్రాఫ్ట్‌లో ఎలా చేయాలో మా సూర్యశ్రీ టీచర్ వివరంగా నేర్పిస్తున్నారు. అలాగే వివిధ రకాల మెహిందీ డిజైన్లలో వేస్తున్నా.

– కమలహాసిని, హిందుపురికాలనీ

పాటలు పాడటం ఇష్టం



నాకు పాటలు పాడటం ఇష్టం. ఈ వేసవి శిక్షణ శిబిరంలో అడ్మిషన్ తీసుకున్న. జానపద గేయాలు ఎలా పాడాలి, సినిమా పాటలు ఎలా పాడాలో ఇక్కడ శిక్షణ పొందుతున్న. ఇలా వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.

– బి.ధృతి, రేకుర్తి

టైలరింగ్ కోసం..



ఇక్కడ ప్రత్యేకించి టైలరింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న. టైలరింగ్‌తో పాటు మెహిందీ, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీలలో తర్ఫీదు పొందుతున్న. ఇలా వేసవి సెలవుల్లో ప్రభుత్వం మాలాంటి వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది.

– యోగిత, అశోక్‌నగర్

కులవృత్తులకు జీవం పోస్తున్నది కేసీఆరే..

- బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



మంత్రి గంగులను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

కరీంనగర్: తెరమరుగవుతున్న కుల వృత్తులను గుర్తిస్తూ వాటికి జీవం పోస్తున్నది సీఎం కేసీఆర్ అని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కులవృత్తుల కుటుంబాలకు చేయూతనిస్తూ కుటుంబానికి రూ.లక్ష సాయం అందించడానికి రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని రజకులు, నాయీబ్రాహ్మణ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మంత్రి గంగులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కులవృత్తులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ అనేక పథకాలను అమలు చేయడంతోపాటు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. ఈ అవకాశాన్ని కుల వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర నాయకులు మైకేల్ శ్రీనివాస్, పూసల శ్రీకాంత్, కుల సంఘాల నాయకులు లక్ష్మయ్య, దుడ్డెల ప్రశాంత్‌కుమార్, పూసాల సంపత్‌కుమార్, అంతగిరి ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, కొండ శ్రీనివాస్, నరేశ్, నేరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరిత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల మోడల్ స్కూల్‌కు చెందిన 16 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ దూలం సుధాకర్‌తో కలిసి శనివారం ఆమె అభినందించారు. జిల్లాలోనే అత్యధికంగా 16 మంది మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికై పాఠశాలలో మొదటిస్థానం, రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచారని తెలిపారు. ఏటా నిర్వహించే ఈ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు అత్యధిక విద్యార్థులు ఎంపికవుతూ ఎలగందుల మోడల్ స్కూల్ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, ఎంఈఓ మధుసూదనాచారి, ఎన్ఎంఎంఎస్ ఇన్‌చార్జి తుమ్మ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

'పది'లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందజేస్తున్నసొసైటీ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వ మైనారిటీ పాఠశాలల్లో పదోతరగతిలో మొదటి, రెండో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం దారుల్ అన్సార్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేశారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లోనే మెరిట్ వస్తుందని నమ్మే తల్లిదండ్రులు ఇది గమనించాలని అన్నారు. కష్టపడితే ఎక్కడైనా ప్రతిభ కనబర్చవచ్చని విద్యార్థులు నిరూపించారని తెలిపారు. ఒక్కో పాఠశాలకు ఇద్దరి చొప్పున మొదటి బహుమతిగా రూ.1,000, రెండో బహుమతిగా రూ.500లను 46 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హఫీజ్ సయ్యద్ రిజ్వాన్, సొసైటీ సభ్యులు ఎండీ తాజ్, నిహాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంబరాలు



కరీంనగర్: వీఆర్‌ఏలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిన సందర్భంగా శనివారం సంబరాలు చేసుకున్నారు. స్వీట్లను పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కర్ణన్‌ను కేసీఆర్ సర్క్యూట్ గెస్ట్‌హౌస్‌లో కలిసి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జేఏసీ నాయకులు నలువాల మల్లేశం, చైర్మన్ కిన్నెర కొమరయ్య, జనరల్ సెక్రెటరీ చెట్టి రవి, ట్రెజరర్ పూరెల్ల మధు, కన్వీనర్ నలువాల సాయికిశోర్, కోకన్వీనర్ ట్రెసా యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పడిగెల రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నల్లా వెంకట్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ విజయ్, కరీంనగర్ అర్బన్, రూరల్ తహసీల్దార్లు సుధాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో పీడీ శ్రీలతారెడ్డి

రామడుగు : మండలకేంద్రంలోని రామడుగు గ్రామ నర్సరీని శనివారం డీఆర్డీవో పీడీ లెంకల శ్రీలతా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లోని మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ పంజాల ప్రమీల, పంచాయతీ కార్యదర్శి రేవంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్‌చైర్మన్ రుద్ర రాజు

కొత్తపల్లి: మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ శహర్‌లో భాగంగా కొత్తపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో రీయూజ్ రీ షెడ్యూల్ రీ సైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు తమ గృహంలోని పాత వస్తువులు, ఉపయోగంలోని లేని వస్తువులు, పాత పాదరక్షలు, పాట బట్టలు, పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రాల వద్ద ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై స్వచ్ఛ కొత్తపల్లిగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రమేశ్, ఏఈ ఆసిఫ్, మెప్మా అధికారి మల్లీశ్వరి, సంధ్యారాణి, మంజుల, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

గన్నేరువరం: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు శనివారం తహసీల్దార్ అనంతరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్ డీలర్లకు ప్రతినెలా గౌరవ వేతనం అందించాలని కోరారు. సమస్యలపై మంత్రి గంగుల కమలాకర్ ఈనెల 22వ చర్చలకు పిలిచారని, తమకు న్యాయం జరగకపోతే జూన్ 5నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చింతల సంపత్, ప్రధాన కార్యదర్శి చాడ బాపి, బిట్ల రమేశ్, పద్మ, గాలి అంజయ్య, శంకరాచారి, బాలయ్య, రమేశ్, ఆయాగ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

మానకొండూర్‌రూరల్ : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. జూన్ 5నుంచి సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సయ్య, రవీందర్, లక్ష్మీరాజం, మల్లేశం, భూంరావు, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నంలో..

శంకరపట్నం: గౌరవవేతనం పెంచాలని రేషన్ డీలర్లు శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు సమ్మె నోటీసును అందించారు. జూన్ 5లోపు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాజు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనపూర్‌లో బీరప్ప ఉత్సవాలు



సైదాపూర్ : మండలంలోని ఘనపూర్‌లో బీరప్ప కల్యాణోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. కురుమల ఆరాధ్య దైవం బీరప్ప, కమరావతి కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా ఒగ్గుడోలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ కురుమలు, పూజారులు పాల్గొన్నారు.

చిత్ర కథ: రహదారిపైనే వ్యాపారం



కరీంనగర్‌లోని అత్యంత రద్దీ ప్రాంతమైన టవర్‌సర్కిల్ వీధి వ్యాపారుల కబంద హస్తాల్లో చిక్కుకొని ఇరుకుగా మారింది. రోజువారి అమ్మకాలతో రహదారి మొత్తం కుదించుకపోయి పాదచారులు, వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 24 గంటలు ట్రాఫిక్ అధికారులు, నగర పాలక సిబ్బంది ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ రహదారులను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

'రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన కేసీఆర్'



మాట్లాడుతున్న డాక్టర్ కె.నగేశ్

విద్యానగర్(కరీంనగర్): కేసీఆర్ తన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి భ్రష్టుపట్టించాడని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో సాధించిన ప్రగతి ఏమి లేనప్పటికీ ఉత్సవాలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పాలన, కుటుంబపాలన సాగిస్తున్న కేసీఆర్‌కు రేపటి ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పుతారని అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌టీపీ నాయకులు శివరాం, ఎండీ బేగ్, ఎండీ ఆరిఫ్, అజారొద్దీన్, రవీందర్‌రెడ్డి, అంజలి, స్వరూప, నజీర్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడ్డ సిబ్బంది విధుల్లో మార్పులు

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో డెలివరీల కోసం వచ్చే వారి బంధువుల వద్ద డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న ఐదుగురు సిబ్బందికి సంబంధించిన విధుల్లో మార్పులు చేశారు. ఈనెల 18న 'మాతా శిశు కేంద్రంలో ఆగని వసూళ్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ నవీన స్పందించారు. ఇద్దరు వైద్యులు డాక్టర్ ఎల్.వర్షి, డాక్టర్ రవిప్రవీణ్‌రెడ్డిలతో కమిటీ వేసి విచారణ చేపట్టారు. విచారణలో కింది స్థాయి సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. సదరు సిబ్బంది ప్రైవేటు ఏజెన్సీకి చెందిన వారు కావడంతో చర్యల కోసం వారు పనిచేసే సంస్థకు ఆదేశాలు జారీ చేశారు. సదరు సంస్థ ప్రతినిధులు ఐదుగురు సిబ్బందిపై వేటు వేశారు. వారు ఇప్పటి వరకు విధులు నిర్వహించే ఎంసీహెచ్ నుంచి ప్రధాన ఆసుపత్రికి మార్చారు. ఇందులో ఏఎంసీలో పనిచేసే ముగ్గురు పేషెంట్‌కేర్‌లు, ఐసీయూలో ఒకరు, లేబర్ రూంలో పనిచేసే ఒకరిని ప్రధాన ఆసుపత్రి విధులకు కేటాయించారు. ప్రధాన ఆసుపత్రి నుంచి ఐదుగురిని ఎంసీహెచ్‌లో విధులు నిర్వహించేందుకు కేటాయించారు. కాగా మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

సీఎం కేసీఆర్, మంత్రి గంగుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



సప్తగిరికాలనీ(కరీంనగర్): కులవృత్తులకు సీఎం కేసీఆర్ రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడం, నాయీబ్రాహ్మణ సెలూన్‌లకు 250 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని హర్షిస్తూ శనివారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రబొజ్జు నర్సయ్య, నీలం మొండయ్య, లక్ష్మణ్‌కుమార్, జంపాల సంపత్, కంది వెంకటేశ్, నాగవెల్లి లక్ష్మణ్, రాజేశం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు కాంగ్రెస్ పెద్దపీట



చొప్పదండి : కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తోందని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కురుమ చైతన్య సమితి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో కర్ణాటక సీఎంగా సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారం చేయడంపై సోనియా, సిద్ధరామయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతి గౌడ్, కొత్తూరి మహేశ్, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, గుర్రం రమేశ్ గౌడ్, మావురం రాములు, నిజానపురం చందు, సంబోజి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సైదాపూర్ : మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శనివారం హన్మకొండలోని ల్యాండ్ మార్క్ హోటల్‌లో జరిగింది. బొమ్మకల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన వీరంతా ఒకేచోట కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.